సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 10 । ఆగస్టు । 2025

కోడెమొక్కుల స్వామికి కోటిదండాలు



వేములవాడ: శ్రావణమాసం సందర్భంగా వేములవాడ రాజన్నను వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం వేకువజాము నుంచి దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

న్యూస్‌రీల్

రేపు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

- జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత



డాక్టర్ ఎస్.రజిత, జిల్లా వైద్యాధికారి

సిరిసిల్ల: జిల్లాలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 11న నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తామని జిల్లా వైద్యధికారి ఎస్.రజిత శనివారం తెలిపారు. ఏడాది వయసున్న పిల్లల నుంచి 19 ఏళ్ల వరకు మాత్రలు అందిస్తామన్నారు. పిల్లలు ఆల్బెండజోల్ మాత్రను నమిలి మింగేలా చూసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. మానవ పేగులలో జీవించే పేగు పురుగులతో కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ఆగస్టు 11న మాత్రలు అందని పిల్లలకు 18వ తేదీన అందజేస్తారని తెలిపారు.

సాహిత్యోత్సవంలో జిల్లా కవులు



డాక్టర్ పెద్దింటి అశోక్‌కుమార్



డాక్టర్ పత్తిపాక మోహన్

సిరిసిల్లకల్చరల్: బుక్ బ్రహ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రం బెంగళూర్‌లో ఈనెల 8 నుంచి మూడు రోజులపాటు దక్షిణ భారత స్వరాలు శీర్షికన సాహిత్యోత్సవం నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం 35 మంది పాల్గొన్నారు. ఇందులో మన జిల్లా నుంచి కథారచయిత పెద్దింటి అశోక్‌కుమార్, బాల సాహిత్యవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్ పాల్గొన్నారు. ప్రాంతీయ అస్తిత్వం సదస్సులో ప్రాంతీయ భాష అస్తిత్వ చేతన అంశంపై పెద్దింటి, బాలసాహిత్యం, రచన కళ సదస్సులో తెలుగు బాల సాహిత్యం, భాష, నాడు–నేడు అనే అంశంపై పత్తిపాక మోహన్ చర్చించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఆరా

వేములవాడ: రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో అవకతవకలు జరిగి, భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నట్లు ఆడియో టేప్ వైరల్ కావడంతో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, కమిషనర్ సీరియస్‌గా వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి అధికారులు వేములవాడలో విచారణ చేపట్టి బాధ్యుడైన లక్ష్మీనారాయణ అనే ప్రైవేట్ సూపర్‌వైజర్‌పై కేసు నమోదు చేశారు. దీంతో ఈవో రాధాబాయి ఆలయంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వారి పనితీరు, నియామకంపై ఆరా తీస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న ఏఈవో, పర్యవేక్షకుడి స్థాయి ఉన్న అధికారులు ముడుపులు తీసుకుని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించినట్లు సమాచారం అందడంతో విచారణ తీవ్రతరం చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న, గతంలో ఇక్కడ పనిచేసి ఇతర దేవాలయాలకు బదిలీపై వెళ్లిన అధికారుల గుండెల్లో గుబులు మొదలైందని సమాచారం.

రాశిగుట్ట తండాలో ఇంటింటా జ్వర సర్వే



మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని భూక్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని రాశిగుట్టతండాలో పీహెచ్‌సీ వైద్యుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా జ్వరసర్వే చేపట్టారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఘనంగా క్విట్ ఇండియా ఉద్యమ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్

సిరిసిల్లటౌన్: క్విట్ ఇండియా ఉద్యమ వేడుకలను శనివారం సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు పాల్గొన్నారు.

ప్రేమానురాగాల రాఖీ



ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న సోదరి లీల

వేములవాడ: ప్రేమానురాగాల వేడుక రాఖీ. అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు ప్రేమతో కట్టేది రాఖీ. శనివారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సోదరి లీల, ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ రాజా యోగ శిక్షణ కేంద్ర సభ్యులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామ కృష్ణకు సోదరి రాధ రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు రాఖీ కడుతున్న సోదరి రాధ

వైభవంగా యజ్ఞోపవీతధారణ



నాగిరెడ్డి మండపంలో యజ్ఞోపవీత ధారణలో యజుర్వేద బ్రాహ్మణులు



అద్దాల మండపంలో యజ్ఞోపవీతధారణలో రుగ్వేద బ్రాహ్మణులు

వేములవాడ: శ్రావణమాసం.. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని రాజన్న ఆలయంలో రుగ్వేద, యజుర్వేద బ్రాహ్మణులు శనివారం యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. ప్రత్యేక హోమం జరిపిన తర్వాత శ్రావణ నక్షత్రం సందర్భంగా రుగ్వేదులు అద్దాల మంటపంలో, పౌర్ణమి తిథి అనుసారం నాగిరెడ్డి మంటపంలో యజుర్వేదులు ఉపాకర్మ నిర్వహించి సామూహికంగా నూతన యజ్ఞోపవితధారణ గావించారు. అయితే ఈసారి రుగ్వేదులు, యజుర్వేదులకు ఒకే రోజు కలిసి రావడంతో ఆలయం బ్రాహ్మణులతో సందడిగా మారింది. మార్కండేయనగర్‌లో స్థానిక పద్మశాలీ కులస్తులు నూతన జంధ్యాలు ధరించారు.

➡ అది సిరిసిల్ల జూనియర్ కాలేజీ మైదానం. అర్ధరాత్రి 12 గంటలు దాటింది. పది మంది యువకులు బైక్‌పై కేక్ పెట్టారు. టపాసులను ప్రత్యేకంగా కాల్చుతూ.. తమ స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నారు. కేక్‌పై పెట్టిన మిరుగులు చిమ్మే క్రాకర్‌ను అంటించారు. అది మిరుగులు చిమ్మకుండా ఠఫ్‌మని పేలింది. కూల్‌కేక్ అంతా నల్లని పొటాష్‌తో నిండిపోయింది. కేక్ కట్ చేయడానికి తప్ప.. తినేందుకు పని రాకుండా పోయింది.

➡ అది వేములవాడ మొదటి బైపాస్ రోడ్డు. అర్ధరాత్రి 12 గంటలకు ఓ 10 నిమిషాలు తక్కువగా ఉంది. అక్కడో 20 మంది యువకుల బ్యాచ్ అప్పటి వరకు బీర్లు తాగుతున్నారు. 12 గంటలకు స్నేహితుడి బర్త్‌డే వేడుకలు నిర్వహించాలని పార్టీ చేసుకుంటున్నారు. సరిగ్గా 12 గంటలు కాగానే.. స్నేహితుడు కేక్ కట్ చేస్తుండగా.. ఇద్దరు యువకులు చెరో వైపు మిరుగులు చిమ్మే పెట్రోలియం నింపిన క్రాకర్‌ను వెలిగించగా ఆ మిరుగులు మంటలుగా మారాయి. బర్త్ డే బాయ్ బట్టలకు చిల్లులు పడ్డాయి.

బేకరీల్లో బేఖాతర్

- కేక్‌లతోపాటు క్రాకర్స్ విక్రయాలు
- జిల్లాలో 85 బేకరీలు
- భారీగా టపాసుల నిల్వలు
- పల్లెల్లోనూ టపాసుల డంపులు
- తనిఖీలు చేయని అధికారులు





బేకరీల్లో కేక్‌ల విక్రయాలు



సిరిసిల్ల: ఈ రెండు సంఘటనల్లో బర్త్ డే వేడుకలు అప్‌సెట్‌కు కారణమైన టపాసులు బేకరీలలో కొనుగోలు చేసినవే. నిబంధనల ప్రకారం బేకరీలలో తినుబండారాలు మాత్రమే విక్రయించాలి. కానీ ఇటీవల వివిధ శుభకార్యాలలో కేకులు కట్ చేయడం సర్వసాధారణమైంది. అదే సమయంలో మిరుగులు చిమ్మే క్యాండిల్స్, చేతుల్లో పట్టుకుని కాల్చే బాంబులను సైతం బేకరీల్లో విక్రయిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమైనా జిల్లా వ్యాప్తంగా అన్ని బేకరీలలో లభిస్తున్నాయి. 1999 ఫైర్ యాక్ట్ ప్రకారం బేకరీల్లో క్రాకర్స్, టపాసులు అమ్మడానికి వీలులేదు. ఇవి నెలల తరబడి నిల్వ ఉండడంతో సరిగా పేలకుండా మిస్‌ఫైర్ అవుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

పల్లెల్లో టపాసుల నిల్వలు

లైసెన్స్‌లు కలిగిన ఊరికి దూరంగా ఉండే గోదాముల్లోనే టపాసులు నిల్వ చేయాల్సి ఉండగా.. జిల్లా వ్యాప్తంగా అన్ని ఊర్లలో టపాసుల నిల్వలు ఉన్నాయి. దీపావళి పండుగ సందర్భంగా అమ్మకానికి తెచ్చిన టపాసులు మిగిలిపోవడంతో ఊర్లలో నిల్వ చేస్తున్నారు. ఊరిలో ఎవరైనా మరణిస్తే అంతిమయాత్రలో కాల్చేందుకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో అనుమతి ఉన్న టపాసుల దుకాణాలు రెండు ఉండగా.. అనుమతి లేకుండా వందలాది షాపుల్లో టపాసుల నిల్వలు ఉన్నాయి. విద్యుత్ ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్స్ జరిగినప్పుడు అపారమైన నష్టం జరిగే ప్రమాదం ఉంది. అయినా దుకాణదారులు అవేమీ పట్టించుకోకుండా టపాసులను నిల్వ చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తరణ

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బేకరీలు ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంలో 25, వేములవాడలో 15 వరకు బేకరీలు ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట, రాచర్ల గొల్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, వీర్నపల్లి, బోయినపల్లి, ఇల్లంతకుంట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేటల్లోనూ బేకరీ షాపులు కనిపిస్తున్నాయి. కూల్‌కేక్‌లు, బ్రెడ్డు కేక్‌లతోపాటు మిరుగులు చిమ్మే క్రాకర్స్ విక్రయిస్తున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం



బేకరీల్లో నిబంధనలకు విరుద్ధంగా క్రాకర్స్ అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే సిరిసిల్ల పట్టణంలో 13 బేకరీ షాపుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించాం. టపాసులు అమ్మవద్దని చెప్పాం. నిబంధనలు పాటించని బేకరీల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. పేలుడు పదార్థాలను నిల్వ చేయడం నేరం. అవి జనావాసాల మధ్య ఉంటే ప్రమాదాలకు కారణమవుతాయి. తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– నరేందర్, ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల



సిరిసిల్లలో ర్యాలీగా వస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పద్మశాలీలు

భక్తిశ్రద్ధలతో నూలుపౌర్ణమి

సిరిసిల్లకల్చరల్: పద్మశాలీయుల ఆరాధ్య దైవం మార్కండేయుని శోభాయాత్ర జిల్లా కేంద్రంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఏటా నూలు పౌర్ణమి పర్వదినంగా జరుపుకోవడం ఆనవాయితీ. రాష్ట్రంలో సిరిసిల్లలో మాత్రమే నూలుపౌర్ణమి వేడుక నిర్వహిస్తారు. కదిలే వాహనంపై మగ్గం ఉంచి వస్త్రం నేసి ఇలవేల్పు మార్కండేయునికి సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత. మార్కండేయ మందిరంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే ప్రాంగణంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ, రక్షాబంధన్ నిర్వహించారు. అనంతరం స్వామి వారి శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని చేనేతన్న విగ్రహానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పూలమాలలు వేశారు. గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, యెల్లె లక్ష్మీనారాయణ, తాటిపాముల దామోదర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవీందర్, గూడూరి ప్రవీణ్, పద్మశాలీ నేతలు మోర రవి, మండల సత్యం, గాజుల బాలయ్య, కాముని వనిత, ఆడెపు చంద్రకళ, గుజ్జె తార, పిస్క మధు, పలువురు వస్త్రోత్పత్తిదారులు పాల్గొన్నారు.



రథంపై మార్కండేయ స్వామి



నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

➡ ఇది ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండా నుంచి బాకూరుపల్లి తండాకు వెళ్లే రోడ్డు. భారీ గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది. ప్రస్తుతం వర్షాకాలంలో రోడ్డు వెంట ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గుంతలను మరమ్మతు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదు.



ఇతను ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన ఆటోడ్రైవర్ అజయ్. నిత్యం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి బండలింగంపల్లి నుంచి ప్రయాణికులు తరలిస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోడ్లు గుంతలుపడి అధ్వానంగా మారడంతో ఆటో పాడవడంతోపాటు వెన్నునొప్పి వచ్చింది. ఆటో తరచూ మరమ్మతుకు వస్తుంది. ఇటు వాహనం, అటు ఆరోగ్యం పాడవడంతో ఇబ్బందులు పడుతున్నాడు. రోజు ఆటో నడిపితే వచ్చే ఆదాయం కంటే ఒళ్లు నొప్పుల మందులకే డబ్బులు ఖర్చవుతున్నాయని ఆవేదన చెందుతున్నాడు.



వెన్ను కదులుతోంది..

- అడుగుకో గుంతతో అధ్వానంగా రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- వర్షం నీటితో కనిపించని గుంతలు
- తెలియక వెళ్లి ప్రమాదాలు
- జిల్లాలో దారుణంగా 52 రోడ్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అడుగుకో గుంత.. కళ్లు మూసి తెరిచేలోపే మలుపులతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం.. చిన్నపాటి జల్లులకే రోడ్లు చిత్తడిగా మారిపోతున్నాయి. ఈ రోడ్లపై నీళ్లు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనదారులకు బ్యాక్ పేన్(నడుము నొప్పులు) పక్కాగా వస్తున్నాయి. ఇటీవల నడుము నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, గంభీరావుపేట మండలాల్లోని గ్రామీణ రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. జిల్లాలోని వివిధ రూట్లలో సుమారు 52 రోడ్లు భారీ గుంతలతో భయంకరంగా కనిపిస్తున్నాయి. గుంతల రోడ్ల దుస్థితిపై అధికారులకు ఎలాంటి పట్టింపులు లేకుండా పోయాయి. కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు.

నడుం నొప్పులతో ఆస్పత్రులకు..

గుంతల రోడ్లపై ప్రయాణాలు చేసే వారిలో 75 శాతం మంది వివిధ రకాల నడుం నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఆటో డ్రైవర్లతోపాటు ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వెన్నుపూస కదలడం, డిస్క్, పక్కటెముకలు, మోకాళ్లు, మెడలు పట్టుకోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మారై, సీటీస్కాన్, ఎక్స్‌రే ఇతరత్ర పరీక్షలతో కలిసి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. నడవలేక, కదలలేక, నిలబడలేక, కూర్చుండలేక ఇబ్బందులు పడుతున్నారు.



ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రాపెల్లివాగు వంతెన వద్ద గల గుంతల రోడ్డు. ఈ రోడ్డు వర్షం నీటితో గుంతలుగా తయారైంది. గుంతలరోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. వాహనాలు పాడవుతున్నాయి. ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు నొప్పులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వాహనాలు మరమ్మతులు చేసుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రాపెల్లివాగు వంతెన వద్దనే కాకుండా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 52 రోడ్ల పరిస్థితులు ఇలాగే ఉన్నాయి.

డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి

తరచూ ప్రయాణించే వారిలో ఎక్కువగా డిస్క్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయి. ప్రాబ్లమ్ గుర్తించేందుకు ఎమ్మారై వంటి పరీక్షలకు కరీంనగర్ తరలిస్తున్నాం. తరచూ ప్రయాణించే వారు మెడ, నడుం బెల్టులను పెట్టుకోవాలి. దీని ద్వారా దీర్ఘకాలిక సమస్యలు రాకుండా నిరోధించవచ్చు. నొప్పుల ఉపశమనానికి ఫిజియోథెరపీకి పంపిస్తున్నాం. అలా కూడా నయం కాకపోతే వెన్నుపూస ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

– సునీల్, ఆర్థోపెడిక్ వైద్యుడు, ఎల్లారెడ్డిపేట

పట్టించుకోని అధికారులు

ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లను సైతం పరిశీలించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేసే అవకాశాలున్నా పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వ ఆఫీస్‌లపై సోలార్ ప్యానెల్స్

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: జిల్లాలోని ప్రభుత్వ ఆఫీస్‌లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్ నుంచి శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి కలెక్టరేట్ వరకు అన్ని ఆఫీస్‌లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొన్నారు. అంతకు ముందు హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వీడియో కాన్ఫరెన్స్‌లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుపై సమీక్షించారు.

జిల్లాలో ఎరువులకు కొరత లేదు

జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో ఎరువుల కొరత ఉందని గంటల తరబడి రైతులు వేచి చూసి ఇబ్బంది పడుతున్నారని జరిగిన ప్రచారాన్ని ఖండించారు. కొందరు కావాలనే రైతులతో మాట్లాడించి తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సిరిసిల్ల శివారులోని అపెరల్ పార్క్‌లో గోదాము ఏర్పాటు చేశామని వివరించారు.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య

గంగాధర: మండలంలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్న అల్లకుంట గంగారాం(70) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన గంగారాం మధురానగర్‌లో తన పెద్ద కొడుకు వద్ద ఉంటున్నాడు. ఐదేళ్ల వ్యవధిలో భా ర్య, కూతురు, చిన్న కుమారుడు చనిపోయా రు. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యా డు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా కనిపించలే దు. శనివారం ఉదయం పెద్దకొడుకు శ్రీనివాస్ ఇంటి షట్టర్ తెరిచి చూడగా వెంటి లేటర్‌కు ఉరి వేసుకొని మృతి చెంది కనిపించాడు. శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన గూడ బాలేశ్వర్‌రెడ్డి(53) అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలు వెంటాడాయి. రెండేళ్ల క్రితం కుమారుడు శ్రీకర్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయాడు. భార్య మమత సిరిసిల్లలో ఆశకార్యకర్తగా పనిచేస్తుండగా, తల్లి వసంత ఊరెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలేశ్వర్‌రెడ్డి శనివారం ఉరివేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.


బాలేశ్వర్‌రెడ్డి (ఫైల్)

జ్వరంతో బాలుడి మృతి

• సిరిసిల్లలో పండుగ పూట విషాదం

సిరిసిల్ల క్రైం: రాఖీ పండుగ రోజు ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆటో కార్మికుడు ఎర్రం బాలయ్య, మంజుల దంపతుల కుమారుడు అశ్విన్ సర్థాక్(6) మూడు రోజులుగా విషజ్వరంతో బాధపడుతున్నాడు. సర్థాక్‌ను తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేసినా జ్వరం తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించగా శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.


అశ్విన్ సర్థాక్(ఫైల్)

సాక్షి సెల్ఫీ బంధన్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాఖీ పండుగను శనివారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ విత్ రాఖీకి భారీ స్పందన వచ్చింది పలువురు సోదరీమణులు సోదరులకు... బిడ్డలు.. తండ్రికి రాఖీ కట్టి సంబరపడ్డారు. తమ అనుబంధానికి గుర్తుగా సెల్ఫీ దిగి సందడి చేశారు.


ఆశిశ్ నందన్, దక్షశ్రీ, కోతిరాంపూర్, కరీంనగర్


వర్షిత, వైశ్విక్ కరీంనగర్


మాన్విక్ శౌర్య, మనుశ్రీ అలుగునూరు, కరీంనగర్


సోదరీమణులతో బాలే అశోక్, జగిత్యాల


రాఖీ వేడుకల్లో దేవేందర్ కుటుంబ సభ్యులు నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల


అన్నకు రాఖీ కడుతున్న జి. మేఘన కొండాపూర్, జగిత్యాల


గసికంటి గంగరాజంకు రాఖీ కడుతున్న సోదరి, రుద్రంగి


కస్తూరి రాజన్నకు రాఖీ కడుతున్న సోదరి లక్ష్మి, కోరుట్ల


కట్ట వేణుకు రాఖీ కడుతున్న సోదరి, తుమ్మనపల్లి జగిత్యాల జిల్లా


కటకం సురేందర్ కుటుంబం, సాయిరాంపూర్ కాలనీ , కోరుట్ల


రాఖీ కడుతున్న కుంట మనస్విని, ధ్రుతి, బందలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట


లాల మహేశ్‌కు రాఖీ కడుతున్న సోదరి, కస్బె కట్కూర్, తంగళ్లపల్లి


రాఖీ వేడుకల్లో మానస కుటుంబం, బొప్పాపూర్, రాజన్న సిరిసిల్ల


నల్లాల మోహన్‌కు రాఖీ కడుతున్న పద్మ, వెంకట్రావ్‌పల్లి, బోయినపల్లి


సోదరీమణులతో నామని శ్రీధర్, వెల్ది, మానకొండూర్, కరీంనగర్


చెల్లెలు ఓమినిరెడ్డితో నర్సింహరెడ్డి, రాజన్న సిరిసిల్ల


నిషిత్, సాహితి, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, రాజన్నసిరిసిల్ల


పారునంది శివతేజకు రాఖీ కడుతున్న సోదరి, మన్నెంపల్లి, తిమ్మాపూర్, కరీంనగర్


చిన్నారులతో రాఖీ కట్టించుకుంటున్న పిట్టల శ్రీకాంత్, సిరిసిల్ల


రజిని, రాకేశ్, బ్యాంక్ కాలనీ, కరీంనగర్


రాఖీలతో సమ్మెట శ్రీహర్షిత్, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల


శశి, వేములవాడ


జక్కె సంయుక్త, జమ్మికుంట


రాఖీ కడుతున్న శ్రావ్య, జగిత్యాల


సింగు లక్ష్మీనారాయణ, సింగు శ్రీనిత్య, రాజీవ్‌నగర్ కాలనీ, చింతకుంట, కరీంనగర్


శ్రీయాన్స్, కమ్మర్‌పల్లి


శ్రీరాం కృష్ణ, విన్ను సరోజా, సంగెం, కోరుట్ల


రాఖీ వేడుకల్లో టి. రాంచరణ్ కుటుంబం, కనగర్తి, కోనరావుపేట, రాజన్న సిరిసిల్ల


తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బొంగాని భారతి, రేణికుంట, తిమ్మాపూర్, కరీంనగర్


ఉడుత శంకర్ యాదవ్, పన్నూర్, రామగిరి, పెద్దపల్లి


రాఖీలు చూపుతున్న విజపల్లి రవీందర్ కుటుంబం, కొత్తపల్లి, జమ్మికుంట, కరీంనగర్


వంతడ్పుల అంజలి, కల్లూరు, కోరుట్ల


విలాసాగరం గంగయ్య, గంగవ్వ, బూర్గుపల్లి, గంగాధర, కరీంనగర్


విలాసాగరం రాంతేజ, శరణ్య, బూర్గుపల్లి, గంగాధర, కరీంనగర్


వెగ్యారపు వెంకట అనీష్, కట్ట శ్రీమయుక్త, జగిత్యాల


నీలి శ్రీవైష్ణవి, శ్రీయ, రాయికల్, జగిత్యాల

భూ సమస్య పరిష్కారం కోసం టవరెక్కిన రైతు

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం నల్లలింగయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు యాళ్ల ప్రకాశ్‌రెడ్డి శనివారం ఓ కంపెనీ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. ప్రకాశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి అన్నదమ్ములు. వీరిద్దరికి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 74, 80లో చెరో 2.22 గుంటల భూమి ఉంది. ఈ భూములోంచే ధర్మారం- పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మించారు. రోడ్డు వైపుఉన్న భూమికి డిమాండ్ పెరిగింది. దీంతో ఇద్దరి మధ్య భూ సమస్య తలెత్తింది. ఈక్రమంలోనే సర్వేనంబరు 74లోని భూమిలో నర్సింహారెడ్డి దుక్కిదున్నుతుండగా.. ప్రకాశ్‌రెడ్డి అక్కడకు వెళ్లాడు. తనకు వాటాగా వచ్చిన భూమిలో ఎందుకు దున్నుతున్నావని ప్రశ్నించాడు. నర్సింహారెడ్డి ఆగ్రహంతో ప్రకాశ్‌రెడ్డిపై దాడికి యత్నించాడు. అంతటితో ఆగకుండా చంపుతానని బెదిరించాడు. గత్యంతరం లేక ప్రకాశ్‌రెడ్డి సెల్‌టవర్ ఎక్కాడు. వారసత్వంగా వచ్చిన ఈ భూమి పంపకం విషయంలో ఇద్దరూ సమానంగా పంచుకున్నా.. నర్సింహారెడ్డి తనకు అన్యాయం చేసినట్లు ఆరోపించాడు. ఇదే సమస్యపై గ్రామంలో పలుసార్లు పంచాయితీలూ జరిగాయన్నాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. సమస్య పరిష్కారం కోసమే టవర్ ఎక్కినట్లు వివరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇవ్వడంతో రైతు టవర్ దిగాడు. కాగా, ఈవ్యవహారం కోర్టు వరకు వెళ్లినట్లు సమాచారం.


టవర్ దిగుతున్న ప్రకాశ్‌రెడ్డి

ఖండాంతరాల్లో రాఖీ వేడుకలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తెలుగు వారంటేనే ఆధ్యాత్మికతకు, భారతీయ సంస్కృతికి ప్రతీకలు. ఈ క్రమంలోనే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా(యూఎస్ఏ)లోని లుసియానా స్టేట్ లఫాయెత్ సిటీలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి మధుమిత - సాయిరాం దంపతులు,


దుబాయిలో వరలక్ష్మీవ్రతం

యూఎస్ఏలో సోదురుడికి రాఖీ కడుతున్న సోదరి

దుబాయిలోని ఆర్జా అల్ నారాలో గుండా రజని- సతీశ్ దంపతులు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం జరుపుకున్నారు. రక్షాబంధన్, యజ్ఞోపవితరణ(జంజిరం) ధరించారు.

రాఖీ కట్టుకుని.. గుండెపోటుతో మృతి

• నిద్రలోనే ప్రాణాలు విడిచిన యువకుడు

గొల్లపల్లి: రాఖీ పండుగ రోజు.. ఉదయం ఆ ఇంట్లో రక్షాబంధన్ వేడకలు ఆనందంగా జరుపుకున్నారు. సాయంత్రం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. రాఖీ పౌర్ణమి పర్వదినాన తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గరిగంటి అనిల్(24) హఠాన్మరణం అందరిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. కుటుంబ సభ్యులు.. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గరిగంటి తిరుపతి, సత్తవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. చిన్నకుమారుడు అనిల్ హైదరాబాద్‌లో ఎంబీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజుల క్రితం స్వగ్రామమైన రాఘవపట్నం వచ్చాడు. స్నేహితులతో ఉత్సాహంగా గడిపాడు. రాఖీ పండుగ సందర్భంగా అక్క అనూష ఇంటికొచ్చింది. ఇద్దరు సోదరులకు రాఖీ కట్టింది. అనూష ఇంటికి రావడంతో ఆ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. అనిల్ మధ్యాహ్న భోజనం చేసి పడుకున్నాడు. సాయంత్రమైన లేవకపోవడంతో కుటుంబసభ్యులు నిద్రలేపారు. ఉలుకుపలుకు లేకపోవడంతో అతడిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిద్రలోనే గుండెపోటు వచ్చినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. పండుగపూట జరిగిన ఈ ఘటన గ్రామస్తులను కలచి వేసింది. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అనిల్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో సీడ్ వ్యాపారి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఉన్న కొత్తలేబర్ అడ్డా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీడ్ వ్యాపారి మృతిచెందగా అతని భార్యకు గాయాలయ్యాయి. టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలం నామాపూర్‌కు చెందిన చాడ కిషన్‌రెడ్డి(57) సీడ్ వ్యాపారం చేస్తూ.. కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తన భార్య రమాదేవితో కలిసి బైక్‌పై మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిషన్‌రెడ్డి కింద పడి స్పృహ కోల్పోయాడు. అతని భార్య తలకు, కాళ్లకు గాయాలు కావడంతో ఇద్దరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్‌రెడ్డి మృతిచెందాడు. మృతుడి సమీప బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కిషన్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉండగా అమెరికాలో ఉంటున్నారు. వారు వచ్చిన తర్వాత అంత్యక్రియలు జరుగుతాయని తెలిసింది.

ఆగిఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడు..

ముస్తాబాద్(సిరిసిల్ల): చెల్లితో రాఖీ కట్టించుకున్న యువకుడు ఉత్సాహంగా ఇంటికి చేరే క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీకొట్టి దుర్మరణం చెందాడు. ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మెయిన్ రోడ్డులో హనుమాన్ ఆలయ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బోరుబండిని శనివారం రాత్రి బైక్ ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పోతుగల్‌కు చెందిన కొప్పు నరేశ్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. కడుపులో తీవ్ర గాయాలు కాగా పేగులు బయటపడ్డాయి. చుట్టుపక్కల వారు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో నరేశ్‌ను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేశ్ మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

నరేశ్ మృతదేహం

కారును ఢీకొట్టిన బస్సు

• నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని కోళ్లఫాం వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నపూర్‌కు చెందిన రాజు, మహేశ్, దేవేందర్, మణికంఠ కారులో కామారెడ్డికి వెళ్తున్నారు. ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సు బైక్‌ను తప్పించబోయి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బతిన్న కారు